# కాంగ్రెస్ అంటే స్కాంలు.. | బీఆర్ఎస్ అంటే స్కీంలు

- 60 ఏండ్లు పాలించి దేశాన్ని, రాష్ట్రాన్ని నిండా ముంచిన్రు
- మళ్లీ ఒక్క చాన్స్ ఇవ్వాలని ఏ మొఖం పెట్టుకొని అడుగుతున్నరు
- ఆదమరిస్తే అంతే సంగతి.. రాష్ట్రం అంధకారమైతది
- మరోసారి ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తాం
- బీఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్
- కొండాపూర్‌లో ప్రజా ఆశీర్వాద యాత్ర



కొండాపూర్‌లో చిన్నపాపతో ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, నవంబర్ 11: ''ఎన్నికలు వచ్చాయని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్, ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని 60 ఏండ్లు పాలించి స్కాంలు తప్ప చేసిందేమీ లేదు. ప్రజలను నిండా ముంచింది. కాంగ్రెస్ అంటే స్కాంలు. బీఆర్ఎస్ అంటే స్కీంలు. ఇలా ప్రతి పనిలో అవినీతికి పాల్పడే కాంగ్రెస్ కావాలా..? తొమ్మిదిన్నరేండ్లలోనే అనేక పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన బీఆర్ఎస్ కావాలా..? మీరే ఆలోచించుకోవాలని'' ప్రజలకు ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. ఎండపల్లి మండలం కొండాపూర్‌లో ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించగా, మహిళలు బ్రహ్మ రథం పట్టారు. యువకులు బైక్‌లతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మంత్రి కొప్పుల మాట్లాడారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్ల పాలనలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో నంబర్‌వన్ స్థానంలో నిలిపారని కొనియాడారు. మాయ మాటలు చెప్పి అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్, ఇప్పుడు మరో అవకాశం ఇవ్వాలని ఏ మొఖం పెట్టుకొని అడుగుతుందో చెప్పాలని ప్రశ్నించారు. అలాంటి వారికి అవకాశం ఇస్తే రాష్ట్రం 50 ఏండ్లు వెనక్కిపోతుందని, మళ్లీ స్కాంలే జరుగుతాయన్నారు. రేవంత్‌రెడ్డి అధికార ఆరాటంతో అడ్డగోలుగా మాట్లాడుతూ సాగుకు మూడు గంటల కరెంట్ సరిపోతదని, 24 గంటలు ఎందుకని దుర్మార్గంగా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ఈ విషయమై కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ నిలదీయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు అది చేస్తాం.. ఇది చేస్తాం అని మాట్లాడుతున్నారని, మరి వారి పాలనలో ఇలాంటి పథకాలు ఎందుకు గుర్తు రాలేదని ప్రశ్నించారు. ఎన్నికలు పూర్తి కాగానే నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు అందజేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం అధ్యక్షులు ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో 100 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరగా, మంత్రి కొప్పుల వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, కొండాపూర్‌కు చెందిన ఇప్పల నాగరాజు కూతురు తన కిడ్డీ బ్యాంక్ డబ్బులను ఎన్నికల ఖర్చు కోసం అందజేయగా, ఆమెను మంత్రి ఈశ్వర్ అభినందించారు. ఇక్కడ ఎంపీపీ కునమల్ల లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, సర్పంచ్‌లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సింహచలం జగన్, నాయకులు గాజుల మల్లేశం, గూడ రాంరెడ్డి, గ్రామ శాఖ గంగాధరి శేఖర్, ఆలయ కమిటీ చైర్మన్ పదిరే నారాయణరావు, రాజ్‌కుమార్, రవి ఉన్నారు.



గీత కార్మిక సంఘం సభ్యులతో సమావేశమైన బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

# ఆశీర్వదించండి.. అండగా ఉంటా

- కాంగ్రెస్, బీజేపీలవి చౌకబారు మాటలు
- స్థానికేతరులకు ఇక్కడ చోటు లేదు
- కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల, నవంబర్ 11: 'కోరుట్లలో స్థానికేతరులకు చోటు లేదు. మీ మధ్య పుట్టి పెరిగి మీ సమస్యలు తెలిసినవాడిగా నన్ను ఆదరించి ఆక్కున చేర్చుకోండి. అండగా ఉంటా.. అభివృద్ధి చేస్తా' అని కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న చౌకబారు మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, ఈ ఎన్నికల్లో తగిన గుణ పాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. శనివారం కోరుట్ల పట్టణంలోని ఎఖీన్‌పూర్‌లో తన తండ్రి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన సంజయ్‌కి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌కు చెందిన 50 మంది కార్యకర్తలు పార్టీలో చేరగా, గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే పట్టణంలోని గీత కార్మిక సంఘం సభ్యులతో పాటూ అంబేద్కర్ నగర్‌లో పలు కుటుంబాలతో సమావేశమై, తనకు మద్దతుగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. ప్రభుత్వం సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రజలకు సమన్యాయం చేస్తుందని సంజయ్ పేర్కొన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి ఆగం కావద్దని సూచించారు. తన తండ్రి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కోరుట్లను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. అన్ని కుల సంఘాలకు భవన నిర్మాణాల కోసం నిధులు అందజేశారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చారని కోరుట్లలో వంద పడకల ఆసుపత్రి, మద్దుల చెరువు మినీ ట్యాంక్‌బండ్, సెంట్రల్ లైటింగ్, బీటీ రోడ్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. స్థానికంగా ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తానని పెద్ద మనసుతో ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని సంజయ్ విజ్ఞప్తి చేశారు. కాగా, ప్రచారంలో మహిళలను ఆత్మీకంగా పలుకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, కౌన్సిలర్లు గుండోజి శ్రీనివాస్, బద్ది సుజాత మురళి, పేర్ల సత్యం, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు కాశిరెడ్డి మోహన్‌రెడ్డి, నాయకులు వరకంటి సాగర్, నర్సారెడ్డి, కరుణాకర్, వినోద్, బలిజ రాజరెడ్డి, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ జీవితం ప్రజలకే అంకితం

- ఆపదొస్తే ఆదుకుంటా, కన్నీళ్లు తుడుస్తా
- ఇతర పార్టీలను నమ్మితే.. ఆగమైతరు
- ఐదేండ్లలో విద్య, వైద్యం, వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తెచ్చా
- సాగుకు 3 గంటల కరెంటిచ్చే కాంగ్రెస్సా.. 24 గంటల బీఆర్ఎస్సా మీరే నిర్ణయించుకోండి
- జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



వంజరిపల్లిలో యాదవులు అందజేసిన గొర్రె పిల్ల, గొంగడితో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

జగిత్యాల రూరల్, నవంబర్ 11: 'నా జీవితం ప్రజలకే అంకితం. నియోజకవర్గంలోని ప్రజలందరూ నా కుటుంబ సభ్యులే. వారికి ఆపదొస్తే ఆదుకుంటా.. కన్నీళ్లు తుడుస్తా. ఒకసారి అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించిన మీ రుణం తీర్చుకోలేనిది. మీ నమ్మకాన్ని ఏనాడూ వమ్ము చేయకుండా పనిచేశా. ఇప్పుడు మరోసారి మీ ముందుకు వచ్చిన. మరోసారి అవకాశం ఇవ్వండి. నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా' అని జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం జగిత్యాల మండలం నర్సింగపూర్, వంజరిపల్లి, గొల్లపల్లి, ధర్మారం, జాబితాపూర్ గ్రామాల్లో జడ్పీ చైర్మన్ దావ వసంత, స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తుంటే.. కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతున్నదని, రేవంత్‌రెడ్డి మూడు గంటలే చాలని అంటున్నాడని, ఎట్ల సరిపోతదో చెప్పాలని ప్రశ్నించారు. నేనొక్కటే ప్రశ్నిస్తున్నా.. వ్యవసాయానికి మూడు గంటలు కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ కావాలా.. 24 గంటలు ఇచ్చే బీఆర్ఎస్ సర్కారు కావాలా..? ఆలోచించుకోవాలని సూచించారు. తెలంగాణ రాకముందు కరెంటు పరిస్థితి ఎట్లుండె..? ఇప్పుడెట్లుంది..? గుర్తు చేసుకోవాలని, నాటికి నేటికి తేడాను గమనించాలని కోరారు. నాడు ట్రాన్స్ ఫార్మర్లు ఎలా కాలిపోయాయో..? కాలిన కరెంట్ మోటర్లు రిపేర్ చేసేందుకు రైతులు ఎన్ని ఇబ్బందులు పడ్డారో.. ఆ బాధలన్నీ ఇంకా కండ్లముందే కదలాడుతున్నాయన్నారు. ఓటు వేసే ముందు ఇవన్నీ ఆలోచించాలని సూచించారు. బీఆర్ఎస్ పాలనలో జగిత్యాల నియోజకవర్గాన్ని సమగ్రాభివృద్ధి చేశామని, గత ఐదేండ్లలో విద్య, వైద్యం, వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తెచ్చానని చెప్పారు. నిరంతరం ఉచిత విద్యుత్, పంటల పెట్టుబడి సాయం వల్ల పంటల సాగు ఘణనీయంగా పెరిగిందన్నారు. ఒక్క నర్సింగాపూర్‌లోనే రూ.10.50కోట్లు రైతుబంధు ద్వారా రైతులకు అందజేశామన్నారు. పంట రుణమాఫీ కింద రూ.2కోట్లు మాఫీ చేశామని, 15మంది రైతు కుటుంబాలకు రైతు బీమా అమలు చేసినట్లు వివరించారు. గడిచిన 77 ఏండ్లలో రైతు మరణిస్తే ఏ ప్రభుత్వమనా..? ఒక్క రూపాయి అయినా ఇచ్చిన పాపాన పోయిందా..? చెప్పాలన్నారు. రైతే కాదు ఇప్పుడు రాష్ట్రంలోని పేదలందరికీ రూ.5లక్షల ఉచిత బీమా చేస్తామని చెప్పారు. జగిత్యాల మాస్టర్ ప్లాన్‌లో నర్సింగాపూర్ గ్రామాన్ని చేర్చడంతో తన పాత్ర ఏమిలేదన్న సంజయ్, ఆ మాస్టర్ ప్లాన్‌ను ఎనిమిది నెలల క్రితమే రద్దు చేసి, సదరు ప్రతిని ప్రజలకు అందజేశామన్నారు. 2018 ఎన్నికల్లో ఓటమి పాలైన జీవన్ రెడ్డికి పట్టభద్రుల ఎన్నికల్లో ఎమ్మెల్సీగా గెలిపించారని, ఆయన పదవీకాలానికి ఇంకా రెండేండ్ల సమయం ఉందన్నారు. ఆయనతో అయ్యేది లేదు.. పోయేది లేదని మండిపడ్డారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు.

## దళితుల ఆత్మబంధువు సీఎం కేసీఆర్: జడ్పీ చైర్మన్ దావ వసంత

గత ప్రభుత్వాలు దళితులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకున్నారని, వారి అభ్యున్నతికి చేసిందేమీ లేదని జడ్పీ చైర్మన్ దావ వసంత మండిపడ్డారు. కానీ సీఎం కేసీఆర్ మాత్రమే దళితులను ఆర్థికంగా అభివృద్ధిలోకి తెచ్చేందుకు దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి ఆత్మబంధువుగా నిలిచారని, వారి ముఖాల్లో చిరునవ్వు నింపారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం సిలిండర్ ధరను భారీగా పెంచిందని, మళ్లీ బీఆర్ఎస్ వస్తే రూ.400 కే సిలిండర్ అందిస్తామని చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మ్యాక కిష్టవ్వ తన ఆసరా పింఛన్ డబ్బుల నుంచి రూ.వెయ్యి ఎన్నికల ఖర్చు కోసం ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు అందజేసింది. ఇక్కడ సర్పంచులు గడ్డం సరోజన, ప్రకాశ్, అంకం మమత, ఎంపీటీసీ మంగళారపు మహేశ్, గిద్దె లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్లు పత్తిరెడ్డి మైపాల్ రెడ్డి, జోగినిపెల్లి సందీప్‌రావు, వైస్ చైర్మన్ సురేందర్, ఏఎంసీ దామోదర్ రావు, మాజీ జడ్పీటీసీ ముస్కు ఎల్లారెడ్డి, పార్టీ అధ్యక్షులు బాల ముకుందం, నాయకులు దావ సురేష్, సదాశివ రావు, తుమ్మ గంగాధర్, గిద్దె రాజు, సర్పంచులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన రంగాపూర్‌కు చెందిన బీజేపీ నాయకులతో బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

# కాంగ్రెస్, బీజేపీలవి ఝూటా మాటలు

- నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలే
- నమ్మితే మోసపోతరు
- బీఆర్ఎస్‌తోనే సంక్షేమం
- వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

మేడిపల్లి, నవంబర్ 11: 'కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్రానికి పట్టిన శని. వాళ్లతో చాలా ప్రమాదం. నోరు తెరిస్తే చాలు అన్నీ ఝూటా మాటలే. నమ్మితే మోసపోతరు. మళ్లీ పాత కథే అయితది' అని వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం జగిత్యాల జడ్పీ ఉపాధ్యక్షుడు ఒద్దినేని హరి చరణ్ రావు, పార్టీ సీనియర్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుడు దరువు ఎల్లన్నతో కలిసి మేడిపల్లి, భీమారం మండలాల్లోని రంగాపూర్, కాచారం, విలయతాబాద్, వెంకట్రావుపేట్, రాగోజిపేట్, ఓడ్యాడ్, కమ్మరిపేట, భీమా రం మండల కేంద్రం, గోవిందారం, పసునూర్, మోత్కురావుపేట, రాజలింగంపేట గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి అని చెప్పారు. ఈ ప్రాం తాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముం దుకు వస్తున్న తనను గెలిపిస్తే, వరద కాలువపై ఎత్తిపోతల పథకంతో మేడిపల్లి, భీమారం మండలాలను సస్యశ్యామలం చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. ఆరు నెలల్లోగా లింక్ రోడ్ల సమస్యలతో పాటు అన్ని రకాల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాగా, ఆయా గ్రామాల్లో చల్మెడకు మహిళలకు ఘన స్వాగతం పలికారు. వెంకట్రావుపేటలో మాజీ సర్పంచ్ అంగడి ఆనందం ఆధ్వర్యంలో చల్మెడకు నాగలిని బహూకరించారు.

## కాంగ్రెస్, బీజేపీల నుంచి వలసల వెల్లువ

మేడిపల్లి మండలం పోరుమల్లకు చెందిన శివ సేన, యువసేన యూత్ సభ్యులు సుమారు 40మంది కాంగ్రెస్, బీజేపీలను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. మేడిపల్లి బీఆర్ఎస్ కార్యాలయంలో ఎంపీపీ ఉమాదేవి, రత్నాకర్ రావు, యువ నాయకుడు వంశీ రావుల ఆధ్వర్యంలో చేరగా, వారికి చల్మెడ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే రంగపూర్ గ్రామానికి చెందిన యువకులు, కాచారం గ్రామానికి చెందిన 30 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వెంకట్రావుపేట గ్రామానికి చెందిన రజక సంఘం సభ్యులు చల్మెడకు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ ఉమా, రాజా రత్నాకర్‌రావు, వైస్ ఎంపీపీ దొంతి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, ప్యాక్స్ చైర్మన్లు రవీందర్ రావు, పానుగంటి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమ్య, ఆదిరెడ్డి, వైస్ చైర్మన్ కొప్పెర లింగారెడ్డి, నాయకులు అం కం సాగర్, రావు శ్రీనివాసరావు, అంగడి ఆనంద్‌కుమార్, ఎండీ రాజబోస్ తదితరులు ఉన్నారు.